క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా మంగళవారం నిలిపివేస్తున్నట్లు ఏఈ దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. మేరికపూడి, మునగపాడు, పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడి, కండ్రిక, యర్రగుంట్లపాడు గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వ్యవసాయ డ్రోన్ అందజేత



దుగ్గిరాల: వ్యవసాయ పనులు నిమిత్తం సబ్సిడీపై డ్రోన్‌ని రైతులకు అందించారు. సోమవారం దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో దేవరపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన కృప కిసాన్ గ్రూపునకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్ మంజూరు కాగా వ్యవసాయ అధికారి పి.శిరీష రైతులకు అందజేశారు. తక్కువ ఖర్చుతో వ్యవసాయ రంగంలో డ్రోన్‌లు రైతులకు ఎరువు మందుల పిచికారీకి ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



దుగ్గిరాల: కార్మిక సంఘాల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పార్టీ నాయకులు జెట్టి బాలరాజు ఎంపీడీవోకు సోమవారం వినతి పత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. కూలీల వేతనాల ఆలస్యం, కనీసం 100 రోజుల పని కల్పనపై వినతి పత్రం అందించామని ఆయన అన్నారు. కార్యక్రమంలో లాయరు వై.స్టాలిన్, అమ్మిరెడ్డి, బ్రహ్మేశ్వరరావు, టి.శ్రీనివాసరరావు, వి.శేషగిరి, శివాంజనేయులు పాల్గొన్నారు. సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కార్మిక నాయకులు షేక్ కరిముల్లా ధర్నా నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీనియర్ నాయకుల శివయ్య, మహిళలు పాల్గొన్నారు.

మరో విద్యుత్ మోటారు చోరీ



తాడేపల్లి రూరల్: ఉండవల్లి అమరావతి రోడ్డులో గుంటూరు చానల్ దాటిన తరువాత పంట పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ మోటారును దొంగిలించారు. రైతు సోమవారం ఉదయం పంటపొలానికి వెళ్లే సరికి మోటారు కనిపించకపోవడంతో ఒక్కసారిగా కంగు తిని తాడేపల్లి పోలీసులను ఆశ్రయించాడు. సేకరించిన వివరాల ప్రకారం.. అమరావతి రోడ్డు దేవుని మాన్యం సమీపంలో వేణుగోపాల రెడ్డి అనే రైతు 2 ఎకరాల్లో అరటి తోటను కౌలుకు సాగు చేస్తున్నాడు. పంటపొలంలో ఉన్న రూ.25 వేలు విలువైన విద్యుత్ మోటారును రెండో సారి దొంగిలించారని రైతు వాపోయాడు. రైతులు పంటపొలాల్లో ఎంత వరకు కాపలా ఉండగలరని.. పోలీసుల నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని ఆయన అన్నారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

తాడికొండ: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రుణాలు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తాడికొండ తహసీల్దార్ మెహర్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఇమ్మడి రామారావు, భద్రయ్య, జోషి, జొన్నల కోటిరెడ్డి, పాలడుగు మణిబాబు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తాడికొండ తహసీల్దార్ కార్యాలయం తహసీల్దార్ మెహర్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. నాయకులు రేపూడి శ్రీనివాసరావు, కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళపై రాయితో దాడి

తెనాలిరూరల్: ఇంట్లో నిద్రిస్తున్న మహిళపై గుర్తు తెలియని బాలుడు రాయితో దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణ చినరావూరు తోటకు చెందిన 42 ఏళ్ల లక్ష్మీ లావణ్య ఇంట్లో నిదిస్తుండగా సోమవారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో అలికిడైంది. లేచి చూడగా ఇంట్లోకి వచ్చిన సుమారు 16 ఏళ్ల గుర్తు తెలియని బాలుడు ఆమెపై రాయితో దాడి చేసి గాయపరిచి వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతన్నలు.. విష సర్పాలున్నాయి జాగ్రత్త!

- అన్ని సర్పాలు విషపూరితం కాదంటున్న వైద్యులు
- అందుబాటులో అన్ని రకాల మందులు



మంగళగిరి టౌన్: ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే పలకరించాయి. వర్షాలు కూడా అధికంగా కురుస్తున్నాయి. ఎండ వేడిమికి ఇన్ని రోజులు కటవల్లో, చెట్ల నీడన దాగిన విష సర్పాలు ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో బయటకు రానున్నాయి. అలా వచ్చిన సర్పాలు పొలాల్లోని రైతులు, ప్రజలను కాటేసే ప్రమాదం పొంచి ఉంది. సాధారణ సర్పాలు అయితే పెద్దగా ప్రాణాపాయం ఉండదు. అదే విష సర్పం కాటు వేస్తే వెంటనే వైద్యం చేయించుకోవాల్సిందే. లేకుంటే ప్రాణాలు కోల్పోయే అవకాశం లేకపోలేదు. ఈ తరుణంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పంట పొలాల్లో అధికంగా..

రైతులు పొలం పనులకు వెళ్లే సమయం ఇదే. జూన్, జూలై నెలల్లో పాములు తమ ఆవాసాలను విడిచి బయటకు వస్తుంటాయి. ఇది పాములకు అనుకూలమైన కాలం. పొలం పనులకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఆహార అన్వేషణలో పాములు పొలం గట్లు, పొదల వెంట సంచరిస్తుంటాయి. కాటువేసిన పాము విషపూరితమో కాదో తెలుసుకోవాలి. పాము కాటువేసిన చోట కట్టుకట్టి ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. ఎలాంటి పాము కాటువేసినా ఆసుపత్రికి తీసుకువెళితే 99 శాతం బతికించే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో పాముల బెడద అధికంగా ఉంటుంది. కానీ భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదు. రాత్రి వేళల్లో నివాస ప్రాంతాల్లో సంచరిస్తూ ఇళ్లల్లోకి వచ్చే ప్రమాదం ఉంది. ముఖ్యంగా అన్నదాతలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అందుబాటులో మందులు..

మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి మండలంలో యూపీహెచ్‌సీలు 9, పీహెచ్‌సీలు 3, తాడేపల్లి మండలంలో పీహెచ్‌సీలు 2, దుగ్గిరాల మండలంలో ఈమని, దుగ్గిరాలలో రెండు ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు మంగళగిరి పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. పాము కాటుకు మందులు ఈ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయి. ఇతర ప్రైవేటు ఆసుపత్రుల్లో సంప్రదించాల్సిన అవసరం లేదని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక చికిత్స చేసి అవసరమైతే జిల్లా ఆసుపత్రికి తరలించి కృత్రిమ శ్వాసను అందించి బతికించే అవకాశముంటుంది. ఆందోళనకు గురై ఆలస్యం చేస్తే పాము కాటుకు గురైన వారు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

విష సర్పాలు రెండు రకాలు..

విష సర్పాలు రెండు రకాలు. మొదటిది న్యూరోటాక్సిన్ రకం. అవి నాగుపాము, కట్లపాము. రెండో రకం హిమోటాక్సిన్. అంటే రక్తపింజర పాము వంటి రకాల పాములు ఉంటాయి. న్యూరోటాక్సిన్ పాము కాటువేస్తే మనిషికి నోటి ద్వారా నురుగు వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంది. ఇది గుండెపై ప్రభావం చూపి నాడీ వ్యవస్థను దెబ్బ తీస్తుంది. హిమోటాక్సిన్‌తో రక్తనాళాలు కణాల్లో కణజాలం నశించి కాటువేసిన భాగంలో వాపు వస్తుంది. కాటు వేసిన పాము ఎలాంటిదో తెలిస్తే చికిత్స చాలా సులభం. పక్కపక్కన రెండు దంతాలు కాటు వేస్తే అది ఖచ్చితంగా విష సర్పమే. పాము కాటు వేసిన దగ్గర నుంచి శరీరంలోకి రక్తప్రసరణలో విషం వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఎటువంటి పాము కాటు వేసినా ఆసుపత్రికి వెళితే రెండు రకాల చికిత్సలు నిర్వహిస్తారు. తీవ్రతను బట్టి ఇంజెక్షన్ ఇస్తారు. యాంటీ వినం, యాంటీ పాలివినం అనే రెండు రకాల మందులు ఉంటాయి. ప్రస్తుతం మంగళగిరి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి.

నాటు వైద్యం చేయకూడదు..



పాము కాటుకు సంబంధించి యాంటీస్నేక్ వీనం ఇంజక్షన్ అందుబాటులో ఉంది. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి. పాము కాటుకు గురైన వ్యక్తులను నేరుగా ఆసుపత్రికి తరలించాలి. మూఢ నమ్మకాలతో సమయం వృథా చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదు. పాము కరిచిన వెంటనే నాటువైద్యం చేయకుండా దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లాలి.

– డాక్టర్ స్నేహరాజ్, మంగళగిరి ప్రభుత్వ వైద్యురాలు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మంగళగిరి టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి బాలాజీ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలో సోమవారం మధ్యాహ్న పథక భోజన కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు, అసంఘటిత కార్మికులు, మధ్యాహ్న భోజన పథక కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జూలై 9వ తేదీన సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షులు కమలాకర్, నాయకులు వెంకట్, కుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ విగ్రహావిష్కరణ

తాడేపల్లి రూరల్: మహానాడు నేతాజీ బాల విద్యాలయంలో సోమవారం నేతాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని కరస్పాండెంట్ సీహెచ్ హరినాథ్, ప్రిన్సిపాల్ సీహెచ్ వి.రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ఎం.సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వి.వెంకటరావులు విచ్చేసి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

నేడు యోగా శిక్షణ కార్యక్రమం

ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్ రజిత్ భార్గవ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ రజిత్ భార్గవ్

మంగళగిరి టౌన్: ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల పేర్కొన్నారు. ఇందులో భాగంగా నగర పరిధిలోని శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ ప్రాంగణంలో మంగళవారం జరిగే యోగా శిక్షణ కార్యక్రమ ఏర్పాట్లను సోమవారం గుంటూరు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రజిత్ భార్గవ్ పరిశీలించారు. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు యోగా శిక్షణ ఉంటుందని అడిషనల్ కమిషనర్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి సుమారు 1000 మంది హాజరు కానున్నారని.. వీరితో పాటు నగర పరిధిలోని వివిధ శాఖల ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర, పట్టణ సీఐ వినోద్‌కుమార్, ఎస్‌ఐ రవీంద్రనాయక్, ఎంటీఎంసీ, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ అమలు చేయాలి



సచివాలయ ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేస్తున్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: ఎన్నికల హామీల్లో భాగంగా కౌలు రైతులకు ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు విజ్ఞప్తి చేశారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో గ్రామ సచివాలయ ఇన్‌చార్జి మహమ్మద్ ఆలీకి రైతులు, కౌలు రైతులు, నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ యజమానితో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద కౌలు రైతులకు రూ.20 వేలు ఇస్తామని అన్నారని తెలిపారు. అధికారం చేపట్టి ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయలేదని విమర్శించారు. వెంటనే అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులతో పాటు ఓసీ కౌలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, అమ్మిశెట్టి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు చర్యలు



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ అనూష

మంగళగిరి టౌన్: మలేరియా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఇందిరానగర్ యూపీహెచ్‌సీ, మలేరియా సబ్‌యూనిట్ ఆధ్వర్యంలో మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీని నిర్వహించారు. మలేరియా నివారణపై అవగాహనను ఏఎస్‌ఎమ్‌లు, ఆశాలు, హెల్త్ సెంటర్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ.. మలేరియా వల్ల చలి, వాంతులు, వణుకుతో కూడిన జ్వరం వస్తుందని అన్నారు. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో లక్షణాలు బయట పడతాయని తెలిపారు. వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి బయట పడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు దీక్షిత, గీత, గ్లోరీ, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్ సైదులు, హెల్త్ అసిస్టెంట్ కడియం శ్రీనివాసరావు, సిబ్బంది, ఏఎన్‌ఎమ్‌లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



దీక్షా శిబిరంలో కార్మికులు, సీఐటీయూ నాయకులు

తాడేపల్లి రూరల్: అధికారంలో ఉన్న పాలకులు ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను సందర్శించి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేకపోవడం వల్లే సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదని విమర్శించారు. సంపద సృష్టికి కార్మికుల శ్రమే మూలమని ప్రపంచం చెబుతుంటే, పెట్టుబడి దారులే కారణమని సీఎం చంద్రబాబు అంటున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఇస్మాయిల్, సాంబయ్య, గురవయ్య, తుపాకుల నాగేశ్వరరావు, దుర్గా భవాని, శారద, రమణమ్మ, సారమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చెక్కు అందజేత



విద్యార్థిని హర్షితకు చెక్కును అందజేస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా

మంగళగిరి టౌన్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రోత్సాహకం కింద నగదు బహుమతి అందజేసింది. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయంలో సోమవారం కమిషనర్ అలీమ్‌బాషా చేతుల మీదుగా రూ.10 వేల చెక్కును విద్యార్థినికి అందజేశారు. విద్యార్థి విజేత స్కూల్‌లో 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించి మంగళగిరి టాపర్‌గా నిలిచింది. అలానే నగర పరిధిలోని ఏపీఎస్‌పీ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న కోటేశ్వరరావు కుమార్తె హర్షితను కమాండెంట్ కార్యాలయంలో సత్కరించారు. కమాండెంట్ మహేష్‌బాబు, అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం హర్షితను సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో వాహనంపై ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు తీవ్రగాయలు అయిన సంఘటన మండల కేంద్రంలోని చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలం సంక్రాంతిపాడు గ్రామానికి చెందిన షేక్.మస్తాన్‌వలి, అతని భార్య సోమవారం ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు వెళుతున్నారు. ఫిరంగిపురంలోని తాజ్ హోటల్ సమీపంలో తమ ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో భార్యాభర్తలకు తీవ్రంగా గాయాలు అయ్యాయి. ఏఎస్‌ఐ మొహిద్దీన్, కానిస్టేబుల్ గురవయ్యలు సంఘటనా స్థలానికి వచ్చి 108 ద్వారా వారిని చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దోమల నిర్మూలనతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: దోమల నిర్మూలనతోనే ఆరోగ్యం చేకూరుతుందని సీహెచ్‌వో వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మలేరియా నివారణ మాసోత్సవం ర్యాలీ ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు ప్రారంభం అవుతుండటంతో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. 4 రోజులకు ఓమారు పీపాలు, కుండలు, బిందెల్లోని నీటిని కడుగుకోవాలన్నారు. నీరు నిలువ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ షేక్.అబ్దుల్ రెహమాన్, హెచ్‌వీ అన్నమేరి, హెల్త్ అసిస్టెంట్ బాబురావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జూద స్థావరాలపై పోలీసులు దాడి

తాడికొండ: తుళ్లూరు మండలం వడ్డమాను గ్రామంలో కొండల మధ్య గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న జూద స్థావరాలపై తుళ్లూరు పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. వడ్డమాను గ్రామంలో టీడీపీకి చెందిన ఓ నాయకుడు గుట్టుచప్పుడు కాకుండా జూదం నిర్వహిస్తున్నారని సమాచారం. దీనికి గుంటూరు, ఇతర ప్రాంతాల వారు వచ్చి జూదం ఆడుతున్నారు. దీంతో దాడులు నిర్వహించిన పోలీసులు ఏడుగురు వ్యక్తులతో పాటు, రూ.36 వేలు నగదు సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుళ్లూరు సీఐ అంజయ్య తెలిపారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



అంజిరెడ్డి భవన్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మంగళగిరి: అధికారంలోకి వచ్చిన బాబు ఏడాదిగా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని.. అందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంగళగిరి నియోజకవర్గ పట్టణ, రూరల్ కన్వీనర్లు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ అన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఎంటీఎంసీ పరిధిలోని ఆత్మకూరు పార్టీ కార్యాలయంలో సోమవారం సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. మోసపు హామీలు, మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడాల్సిన సమయం ఆసన్నమైందని నాయకులు అన్నారు. కార్యక్రమంలో పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మంగళగిరి మండల ఉపాధ్యక్షుడు బొమ్ము సాంబిరెడ్డి, యూత్ అధ్యక్షుడు కొండమడుగుల గోపిరెడ్డి, అనుబంధ సంఘాల ప్రతినిధులు ఆర్ల చిన్నారి, షేక్ గౌస్ మొహిద్దీన్, గుంటి రాజ్యలక్ష్మి, మాదాల గోపీకృష్ణ, నందిగం ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: ఏడాదిగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా చంద్రబాబు వెన్నుపోటు రాజకీయం చేస్తున్నారని పార్టీ మండల అధ్యక్షులు తాడిబోయిన శివ గోపయ్య అన్నారు. బుధవారం జరగనున్న వెన్నుపోటు దినం పోస్టర్లను దుగ్గిరాల రైలుపేటలో సోమవారం ఆయన ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో కూటమి పాలకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని దుయ్యబట్టారు. ఉపాధ్యక్షులు నూతక్కి కోటేశ్వర రావు, కోశాధికారి రామకోటి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పి.సంసోనమ్మ, బీసీ సెల్ అధ్యక్షులు ఎస్.వెంకట్రావు, బీసీ సెల్ నాయకులు ఎ.మహేష్, ఎంపీటీసీ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని, పేరుకలపూడి సర్పంచ్ జి.గంగాధర్ యాదవ్, దుగ్గిరాల సీనియర్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు జరిగే వెన్నుపోటు దినంను జయప్రదం చేయాలని సోమవారం సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్యలు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఎలాంటి సంక్షేమ పథకాలు చేపట్టలేదని అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4వ తేదీన గుంటూరులో వెన్నుపోటు దినంను నిర్వహిస్తున్నామని.. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, మాజీ కౌన్సిలర్లు దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, మొహమ్మద్ గోరేబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ముదిగొండ ప్రకాష్, రాష్ట్ర సోషల్ మీడియా కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి మేకా వెంకటరామిరెడ్డి, షేక్ జావీద్, నియోజకవర్గ స్థాయి వివిధ విభాగాల అధ్యక్షులు, మండల పట్టణంలోని వివిధ విభాగాల అధ్యక్షులు, పార్టీ పట్టణ మండల కమిటీ సభ్యులు, నాయకులు కళ్లం రాజశేఖరరెడ్డి, పాటిబండ్ల కృష్ణమూర్తి, మిరియాల రాంబాబు, మేకా దామేశ్వర్ రెడ్డి, నూతక్కి శ్రీనివాసరావు, కళ్లం పిచ్చిరెడ్డి, కూరపాటి సాంబిరెడ్డి, గజ్జలకొండ కోటేశ్వర రావు, తమ్మా నారాయణ రెడ్డి, కళ్లం కోటిరెడ్డి, ఎం.పీటర్, తొత్తుక నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగళగిరి టౌన్: కౌలు చట్టంలో సమూలమైన మార్పులు చేసి, యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కౌలు రైతులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళగిరి మండలంలోని పంటకాలువల్లోని గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రతి కౌలు రైతుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనులను సంవత్సరంలో 200 రోజులు పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతు, రైతు, వ్యవసాయ సంఘాల నాయకులు దుర్గారావు, పకీరయ్య, జవహర్ లాల్, జేవీ రాఘవులు, యస్‌యస్ చెంగయ్య, పిల్లలమర్రి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో ముగ్గురికి బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో తెనాలి జేఎస్ ఫిట్‌నెస్ క్లబ్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులకు బంగారు పతకాలు, ఒకరికి వెండి, మరొకరికి కాంస్య పతకం లభించినట్లు క్లబ్ నిర్వాహకులు కె.ప్రసాద్‌బాబు తెలిపారు. పోటీలను ఆదివారం రేపల్లెలో నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం క్లబ్ ఆవరణలో అభినందించారు.

చేతి రాత అందంగా ఉండేలా చూసుకోండి

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహన్



మాట్లాడుతున్న రామ్‌మోహన్

తెనాలిఅర్బన్: చేతి రాత అందంగా ఉండేలా చూసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహన్ పేర్కొన్నారు. మారీసుపేటలోని ఎన్‌సీఆర్ ఎన్‌ఎంహెచ్ స్కూల్‌లో చేతి రాత పై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు తమ చేతి రాతను ఏ విధంగా అందంగా తీర్చిదిద్దాలో శిక్షణ ఇచ్చారు. ఇలా చేయడం వలన వీరు విద్యార్థులకు నేర్పిస్తారనే భావనను ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు డి.ఆదినారాయణ, కె.ఏసుబాబు, సి.హెచ్.నాగేశ్వరరావు, వై.విజయలక్ష్మి, టి.మహాలక్ష్మీ, యు.రామ్‌మోహన్ బృందం పాల్గొన్నారు.